

# హెచ్చరిక

భూగర్భశాస్త్ర పరిశోధకుడిలా గచ్చునేలను తీవ్రంగా చూచుకుంటూ, చకచకా సేవింగ్సు కౌంటరు దగ్గరకెళ్ళి, తలెత్తి చూచి, ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి కదలకుండా ఉండిపోయాడు రాజారావు.

అక్కడో కదిలేబొమ్మ ఉంది. అందమైన బ్యాంకు ఉద్యోగిని రూపంలో కదులుతోంది.

రాజారావు ఈ బాంకు మెట్లు చాలాసార్లు ఎక్కి ఉన్నాడు. కానీ ఎప్పుడూ ఆమె కన్పించలేదు. ఇప్పుడు క్రొత్తగా కన్పిస్తుందంటే ఆమె క్రొత్తగా వచ్చిందని స్పష్టంగా తెలిసిపోతుంది.

ఆమె వంక అదేపనిగా ముఖం వాచిన గుడ్లగూబలా చూడటం సభ్యతగా ఉండదు కాబట్టి, విత్‌డ్రాయల్ ఫారం తీసుకుని, ఎనభై రూపాయలు తీసుకుందామనుకున్న వాడల్లా నూట యాభై రూపాయలకు ఆర్డరు వ్రాసి అందించాడు.

"పాస్ బుక్ ప్లీజ్"—అందామె.

రాజారావుకు ఆమె కంఠస్వరం వీణాగానంలా మధురంగా తోచింది. అసలు అందమైన ఆడపిల్లలు మాట్లాడితే ఎప్పుడైనా వినటానికి సొంపుగానే ఉంటుంది.

పాస్‌బుక్ ఇచ్చేశాడు రాజారావు. ఆమె తన ప్రక్కన ఉన్న ట్రేలోంచి ఒక టోకెన్ చేతిలోకి తీసుకుంది. ఆ టోకెన్

అందుకు నేటప్పుడు ఆమె చేతి వ్రేళ్ళను తాకి, ఆ స్పర్శానందాన్ని అనుభవించాలని దురాశపడ్డాడు రాజారావు. కానీ ఆమె అతి జాగ్రత్తగా ఆ టోకెన్‌ను కౌంటర్ బల్ల మీద పడేసి, కొంపలు మునిగిపోతున్నట్లుగా చటుక్కున చేయి వెనక్కు తీసుకుంది. ఎలక్షన్లలో నిలబడి ఓడిపోయినట్లనిపించింది రాజారావుకు. అసలు రాజారావుకెప్పుడూ అంతే. తన ఊహకు వ్యతిరేకంగా ఏమి జరిగినా, తాను ఎలక్షన్లలో నిలబడి ఓడిపోయినట్లే అనిపిస్తుంది. అనుకున్న దనుకున్నట్లు జరిగితే మాత్రం, ఎలక్షన్లలో అంతులేని మెజార్టీతో గెల్చినట్లుంటుంది. అయితే ఇంతవరకూ అతడు ఎలక్షన్లలో ఎప్పుడూ గెల్చినట్లులేదు.

ఆమె చాలా అందంగా, నడవకుండా ఎగిరి వచ్చిన పారిజాతంలా ఉంది. చాలా అమాయకంగానూ, అణకువగానూ ఉంది. 'దూకుడు'—'దుడుకుతనం' లేవు. ఆమె ఏంచేస్తున్నా నిదానంగా శరత్కాలపు వెన్నెలలో ఏరు పారుతున్నట్లుగా, ఏనుగు నడుస్తున్నట్లుగా, అతి నిబ్బరంగా ఉంటుంది. ఆమె తన సన్నని పొడవైన వ్రేళ్ళతో అలా మెల్లగా కాగితం త్రిప్పినా, పసిపిల్లను ఊయలలో పడుకోబెడుతున్నట్లుగా, ఏ మాత్రం బాధకలగకుండా, అతి నెమ్మదిగా పెన్నును బల్లమీద పెట్టినా, తిరిగి మల్లెపూవును అందుకుంటున్నట్లుగా బహు సున్నితంగా దానిని చేతిలోకి తీసుకున్నా, అద్భుతంగా ఉంటుంది. అంతెందుకు ఆమె ఏపని చేసినా, అదే పనిని మళ్ళీ చేస్తే చూడాలనిపిస్తుంది. ఆమె విశాలమైన నేత్రాలలో దోబూచులాడే బిడియం, బెదురుతనం, అణకువ, వినమ్రత, ఎలాంటివారిలోనైనా ఒక గౌరవ భావాన్ని పొంగింపచేస్తాయి.

రాజారావు ఆమె మెడవేపు చూశాడు. పచ్చగా మెరుస్తుంది మెడ. మెడలో పచ్చ తాడు లేదు. "అంటే అవివాహితే నన్నమాట." అనుకున్నాడు రాజారావు. ఆ భావం అతడికి ఎంతో రిలీఫ్ నిచ్చింది.

కాషియర్ పిలిచాడు రాజారావు టోకెన్ నంబరుని. రాజారావు వెళ్ళి డబ్బు తీసుకున్నాడు.

*  *  *

మరునాటి సాయంత్రం ట్రిమ్ముగా తయారై, అయిదు గంటలకు అర్ధగంట ముందే వెళ్ళి, బాంకు గేటుదగ్గర బీటు వేశాడు రాజారావు. అయిదు గంటలకు ఒక్కొక్కరే బయటకు రాసాగారు. అందరికంటే వెనుక ఆమె వచ్చింది. ఆమె ప్రక్కన మరో అమ్మాయిగూడా ఉంది. తీయని పానకంలో బలిసిన పుడకలాగా అనిపించింది రాజారావుకా ప్రక్కనున్న అమ్మాయి.

వాళ్ళిద్దరూ బస్టాపుకేసి నడవసాగారు. జీతం బత్తెం లేకుండా అట్టేపెట్టుకున్న బాడీగార్డులా వెనకనే అనుసరించాడు రాజారావు. బస్టాపు చేరగానే అప్పుడే వచ్చిన బస్సులోకి తన "క్లియోపాత్రా" ఎక్కేసింది. అదృష్టవశాత్తూ "తిమ్మాయి" అక్కడే ఉండిపోయింది. తనూ బస్సులోకి ఎక్కాడు రాజారావు. టికెట్ ఆమె ఎక్కడకు తీసుకుంటుందో తెలీదు గాబట్టి పెర్మి

నల్ పాయింట్ వరకూ టికెట్ తీసుకున్నాడు.

ఆమె మధ్యలోనే దిగింది. రాజారావూ దిగాడు. ఆమె మెల్లగా ముందుకు నడవసాగింది. తనూ నడవసాగాడు. అతడు ఎంత మెల్లగా నడిచినా, ఆమె అంత మెల్లగా నడవలేకపోతున్నాడు. ఇద్దరి మధ్యా దూరం తరిగిపోయి దాదాపు ప్రక్కప్రక్కనే నడిచే స్థితికి వచ్చారు. ఇంకో రెండుమూడు నిమిషాల్లో అతడామెను దాటేసి ముందుకు వెళ్ళిపోతాడు. అతనిలో కల్లోలం రేగసాగింది. ఆమెతో ఎలా మాట్లాడాలో ఏం మాట్లాడాలో అర్థం కావటంలేదు. తీరా ఇంతదూరం వచ్చి గప్‌చిప్‌గా వెనక్కు వెళ్ళటానికి మనసొప్పటం లేదు.

రాజారావు సాహసం చేశాడు. ఒక్క అడుగు ముందుకువేసి, ఆమెకు కొంచెం దగ్గరగా వచ్చి, అన్నాడు—మిస్! మీరేమనుకోకపోతే ఒక్క క్షణం మీతో మాట్లాడాలి."

ఆమె ఆగి, తలెత్తి, తన విశాలమైన నేత్రాలను ఇంకా పెద్దవిగా చేసి, అతనికేసి చూస్తూ అంది—"మీరూ. . ." ఆమె కంఠం చాలా సన్నగా, తియ్యగా ఉంది.

"నడుస్తుండండి మాట్లాడతాను. . .నా పేరు రాజారావు. గ్రాడ్యుయేషన్ వరకూ చదివాను. ప్రస్తుతం ఓ గవర్నమెంటు ఆఫీసులో క్లర్కుగా పనిచేస్తున్నాను." అన్నాడు తను పనిచేస్తున్న ఆఫీసు పేరు చెప్పి.

"నాతో పనేమిటో చెప్పారు కారు."

"చెప్తాను. దయచేసి మీ పేరు?"

"దమయంతి."

"దమయంతి! — చాలా చక్కగా ఉంది పేరుకూడా" అని, తనూయించుకుని, మళ్ళీ అన్నాడు. "సారీ! మీరేమీ అనుకోవటం లేదుగా."

"ఎందుకూ అనుకోవటం?"

"నేనిలా మాట్లాడుతున్నందుకు."

"మీ రిప్పటివరకూ ఏమీ మాట్లాడలేదే అసలు."

"ఆ. ఆదే! నాకు ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలియదు. అసలు పుట్టిన తర్వాత ఇంతవరకూ మా అమ్మతోటీ, బామ్మతోటీ, తప్పితే మరో స్త్రీతో మనసు విప్పి మాట్లాడలేదు."

"మీరిప్పుడు నాతో ఏం మాట్లాడాలనుకుంటున్నారు?"

"మీరేమీ అనుకోవటం లేదుగా."


"నేనేమీ మాట్లాడా లనుకోవటం లేదే." తెల్లబోతూ అందామె.

"అదే— వాటైమీన్— చెప్పానుగా నాకు మాట్లాడటం చేతకాదని. దయచేసి ఈ పార్కులోకి వెళ్ళి కూర్చుందాం వస్తారా. ఒక్క ఆయిదు నిమిషాలంటే అయిదే నిమిషాలు. మీతో స్థిమితంగా మాట్లాడాలి. ప్లీజ్. కాదనకండి." అభ్యర్థనగా అన్నాడు రాజారావు.

ఆమెది చాలా మెత్తని హృదయం. తాను దురుసుగా ప్రవర్తిస్తే ప్రక్కవాళ్ళు ఎక్కడ బాధపడతారో అని ఆమె సంకోచం. అంచేత రాజారావు అభ్యర్థనను కాదనలేకపోయింది.

"సరే. పదండి" అందామె.

"థాంక్యూ! నాకు తెలుసు—మీరు కాదన




రని. నేను మీకు చాలారిస్కు ఇస్తున్నాను. నాకోసం మీరు చాలా రిస్కు తీసుకుంటు న్నారు. కదూ!"

"అబ్బే! లేదు. మరేం పర్వాలేదు."

పార్కులో చాలా మంది జనం ఉన్నారు.

"ఇక్కడ కూర్చుందామా?" అన్నాడు ఆమె అంగీకారంకోసం చూస్తూ.

"కూర్చోండి."

ఇద్దరూ కూర్చున్నారు.

"మీరేమైనా అనుకుంటున్నారా నన్ను గురించి?"

"ఏమీ అనుకోవటం లేదే."

"అహ!—ఏంలేదు. అపరిచితుణ్ణి— హఠాత్తుగా రోడ్డుమీద కనుపించి, ఇలా మాట్లాడి, ఇలా తీసుకొచ్చి, ఇలా కూర్చో పెడితే కొంచెం ఎబ్బెట్టుగా ఉంటుంది. కానీ, మీతో పరిచయం చేసుకోవటానికీ, మాట్లాడటానికీ ఇంతకంటే వేరే మార్గం నాకు దొరకలేదు. ఇది చాలా అసహ జంగా వుంది. సహజంగా ఉండాలంటే ఎలా చేయాలో నాకుతెలీలేదు. అందుకని- మీరేమైనా అనుకుంటున్నారేమోనని—"

ఆమె తెల్లబోయి అంది "నేనేమను కొంటున్నానో అన్నమాట తప్ప మరి మాట్లాడేదేమీ లేకపోతే, దయచేసి నన్ను వెళ్ళనివ్వండి."

"అబ్బెబ్బే! మీరలానే కూర్చోండి. మీతో ఎంతో చెప్పాలని ఉంది. మనసంతా విప్పిచూపాలని ఉంది. కాని ఎలా చెప్పాలో అర్థంకావటంలేదు. కొన్ని కొన్నిమాటల్ని అందంగా, చెప్పీ చెప్పనట్లుగా, స్పష్టంగా చెప్పకుండానే అర్థమయేట్లుగా చెప్పాల్సి ఉంటుంది. కానీ, నాకలా చెప్పటం తెలీదు. నేనేం మాట్లాడినా, సూటిగా చెరుగ్గడ విరిచినట్లుగా ఉంటుంది. అలా మాట్లాడితే మీకు కోపం వస్తుందేమోనని—"

"కోపమేం రాదు. చెప్పండి ఏమిటో."

"నిజంగా కోపం రాదుగా."

"రాదు."

"నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నాను—మీ రొప్పుకుంటే."

ఆమె చివ్వున తలెత్తి, అతని ముఖం లోకి చూచింది. అప్పటికే ఆమె ముఖం ఎఱ్ఱబడింది. మరుక్షణంలో చటుక్కున అక్కడ నుంచి లేచి, చరచరా అడుగు లేసుకుంటూ వెళ్ళిపోయింది.

రాజారావు బిత్తరపోయాడు. మళ్ళీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు ఫీలయ్యాడు. తాను తప్పుగా ఏం మాట్లాడాడో అతనికి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

* * *

ఆ మరునాడు గూడా రాజారావు ఆమెను అదే చోట కలుసుకున్నాడు. అతడే ముందు మాట్లాడాడు, "సారీ! నిన్న నేను చాలా దురుసుగా 'బిహేవ్' చేశాననుకుంటాను."

"అబ్బే! అదేం లేదు."

"మరెందుకలా కోపంగా వెళ్ళి పోయారు?"

"మీరసలు ఆ ప్రశ్న అడుగుతారని ఊహించలేదు. అది నాకు నచ్చనిప్రశ్న."

"ఏం? మీకు మారేజ్ చేసుకోవాలనే ఉద్దేశం లేదా?"

"మళ్ళీ అదేప్రశ్న అడుగుతున్నారు."

"సారీ! మీ కిబ్బంది కలిగిస్తే క్షమిం చండి. మీకు యిష్టం లేకపోతే చెప్పవద్దు. కానీ ఈ ప్రశ్నకు జవాబు లేకపోతే నేను అర్థంకాని అయోమయంలో పడతానని గుర్తుంచుకోండి."

ఆమె చివుక్కున తలెత్తి తన పెద్ద నేత్రాలతో అతడిని చూసి అన్నది. "మీ రెందుకు అంతగా బాధపడటం. నేనే చెప్తాను."

"థాంక్స్. చెప్పండి."

"మీలాగే నాకూ వంకరగా చెప్పటం చేతకాదు. సూటిగానే చెప్తాను."

"చెప్పండి. ఐ లైకిట్."

"నాకింతకు క్రితమే వివాహమైంది."

రాజారావు బిత్తరపోయాడు. క్షణం ఆగి, అన్నాడు. "మరి మీ మెడలో తాళి బొట్టు లేదేం?"

"ముఖం మీద బొట్టుకూడా లేదు. చూడలేదా మీరు?"

"అంటే అంటే "

సమాధానంగా ఆమె కంటనీరు తిరి గింది.

* * *

ఆ తర్వాత రాజారావుకు ఆమెను గురించి పూర్తిగా తెలిసింది.

ఆమె భర్తతో ఒక్క సంవత్సరం కాపురం చేసింది. బిడ్డలయితే కలుగలేదు. అతడేదో మంచి ఉద్యోగంలోనే ఉండే వాడట. అతడు పోయాకనే ఆమెకీ ఉద్యో గం వచ్చింది. ప్రస్తుతం ఆమెతో ఆమె ముసలి తల్లిదండ్రులూ, అత్తగారూ ఉంటున్నారు. ఆమె మామగారు చాలా కాలం క్రితమే కీర్తిశేషులయ్యారు. ఆ కుటుంబానికి ఆమే ఆధారం.

ఈ విషయాలు తెలుసుకున్న తరువాత రాజారావుకు ఆమె మీద ఒక విధమైన జాలి కలిగింది. ఆమె జీవితంలో వంచింప బడింది. విధిచేత దగా చేయ బడింది. చూడగానే ఎక్కడలేని అను



తిలక్ దర్శకత్వంలో ఆంధ్ర ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం 'కొల్లేటి కాపురం'లో కృష్ణ, ప్రభ.

రాగాన్నీ ఉప్పొంగింప జేసే ఆమె కన్నుల వెనుక ఎంత శోకం! ఎంత శోకం!! అంత నిబ్బరంగా, అంత హుందాగా ఉండే ఆ అందాల రాణికి ఎంత కష్టం! ఎంత కష్టం!!

ఆ అందాన్ని స్వంతం చేసుకోలేక పోతే తన జీవితానికి సార్థకత లేదనిపించింది రాజారావుకి. అది ప్రేమ కావొచ్చు, ఆరాధనకావొచ్చు, కామం కావొచ్చు,— అతడిలో మాత్రం ఆమెను వొదులుకోవటం తనకు సాధ్యం కాదనే భావం చోటు చేసుకుంది.

"మీ కథంతా తెలుసుకున్నాక, మిమల్ని మా రేజి చేసుకునేందుకు అభ్యం[illegible]న్నది నాకేమీకనుపించలేదు" అన్నాడు రాజారావు దమయంతిని కలుసుకుని.

ఆమె విస్మయంగా అతని ముఖంలోకి చూచింది. ఆమె విశాలనేత్రాలు ఇంకా విశాలమయ్యాయి. ఆ కన్నుల్లోకి చూస్తూ తాను జీవితాన్ని రమణీయంగా గడిపేయగలడనిపించింది రాజారావుకు.

ఆమె మొదట నమ్మలేనట్లుగా చూచింది. ఆ తర్వాత రాజారావును ఎనలేని పూజ్య భావంతో చూసింది. ఆ తర్వాత నును సిగ్గుతో తలను వంచుకుంది.

"నేను చాలా అదృష్టవంతుణ్ణి." అన్నాడు రాజారావు తృప్తిగా.

* * *

"నిన్న సాయంత్రం పురోహితుణ్ణి కలిశాను." అన్నాడు రాజారావు.

"ఎందుకు?" ఏమీ తెలియనట్లు అడిగింది దమయంతి.

"అనుకున్నది జరగనప్పుడు ఎందు కయితేనేం?"

"ఇంతకీ ఏమయిందేమిటి?"

"పిలక పీకేయాలనిపించేంత వరకూ అయింది."

"ఎందుకు? మీరు అంటించుకోవటానికా?"

"నీకు నవ్వులాటగానే ఉంటుంది."

"నవ్వనుగానీ, మీ పిలకలాట వెనుక కథేమిటో చెప్పండి కొంచెం."

"నాలుగు నెలలవరకూ ముహూర్తాలు లేవన్నాడు."

"పాపం ముహూర్తాలగ్గూడా స్కేర్సిటీ ఉంది కాబోలు. ఆయనేం చేస్తాడూ?"

"అక్కడికీ అడిగాను. ఏదో వీలు చూచుకుని, ఎలాగైనా ఒక నెలలోగా చూడమని."

"చూడనన్నాడా?"

"చూస్తానన్నాడు. పంచాంగ మంతా తిరగేసి చూశాడు కూడా. చూసి 'లేవండీ' అన్నాడు పళ్ళికిలిస్తూ."

"దక్షిణ ఎంతిచ్చారు?"

"రూపాయి."

"అయిదు రూపాయలివ్వొచ్చు— పంచాంగమంతా తిరగేసినందుకు, 'పంచ' అంటే అయిదుకదా. మర్యాదగా రేపు ప్రొద్దున్నే వెళ్ళి మిగిలిన నాలుగూ ఇచ్చి రండి."

"రేప్రొద్దుటి వరకూ ఏం ఖర్మ? నిన్న సాయంత్రమే ఇచ్చిఉండే వాణ్ణి. అయిదు కాదు—పదిరూపాయలు—నెల రోజుల లోపల ముహూర్తం ఉందని చెప్తే."

"అంత తొందరగా ఉందా అబ్బాయి గారికి పెళ్ళికోసం."

"ఇప్పటికిగాని అర్థం కాలేదన్నమాట నీకావిషయం."

"నాలుగు నెలలు ఆగొచ్చులెండి. ఏం ఫర్వాలేదు."

"బోలెడంత పర్వా ఉంది. లేకపోవట మేమిటి? నువ్వేమో కొంపలు చిక్కిపో తున్నట్లుగా పెళ్ళయేవరకూ దూరం దూరం అంటూ మడికట్టుకుంటుంటివి. అలా మడి కట్టుకోకుండా ఉంటే పర్వా ఏమీ ఉండదు. ఏమంటావ్ మరి?"

"అదుగో మళ్ళీ పాతపాటే. ఆ మాటలు వద్దని ఎన్నిసార్లు చెప్పినా వినరు గదా." చిరుకోపం ప్రదర్శిస్తూ బుంగ మూతి పెట్టిందామె.


"అబ్బ! నీ మూతి ఇప్పుడు భలేగా ఉంది."

"పొండీ."

"అంటే రండీ అనేగదూ అర్థం?"— అంటూ అతడు మీది మీదికి రాబోయాడు. ఆమె దూరం దూరం అంటూ ప్రక్కకి జారుకుంది.

మరో రోజున ఇద్దరూ రాజారావు గదిలో చెరో కుర్చీలో కూర్చుని ఉండగా దమయంతి హఠాత్తుగా అడిగింది. "మీకు సాహిత్యమంటే ఇష్టంలేదా?"

"అదంటే నీకు ఇష్టమో కాదో చెప్పు ముందు." అన్నాడు రాజారావు.




"నాకు చాలా ఇష్టం."

"అయితే నాకూ అంతే."

"మీకు ఏ రచయిత అంటే ఇష్టం?"

"నీ కెవరు ఇష్టమో చెప్పు ముందు."

ఆమె ఏదో పేరు చెప్పిఅన్నది. "ఆమె రచనలంటే నాకు చాలా ఇష్టం. మీకో?"

రాజారావు కొద్దిగా ఆలోచించి, తల పంకించి అన్నాడు. "నువ్వు చెప్పిన పేరు నేనెప్పుడూ విన్లేదు. ఇంక ఆమెను గూర్చి నాకేం తెలుస్తుందీ?"

"పోనీలెండి. మీకు తెలిసిన వాళ్ళలో ఎవరంటే ఇష్టం?"

"నువ్వంటే ఇష్టం."

"నా సంగతి కాదండీ ..."

"ఎందుక్కాదు? నాకు నీ సంగతే కావాలి."

"అబ్బ! మీరొట్టి రోడ్డు రోమియో." ఆమె చిరుకోపంతో అన్నది.

"కరక్టే. నేను రోమియో, నువ్వు జూలియట్."

"అదేం కాదు. వాళ్ళకథ విషాదాంతం. మనదలా కాదు కాబట్టి పోలిక కుదరలేదు."

"అయితే నేను మజ్నూ, నువ్వులైలా-నో నో. ఇదీ ట్రాజిడీయే. కాబట్టి నేను దేవదాసు, నువ్వు—నాన్సెన్స్! అసలీ రచయిత లెవరికీ బుద్ధిలేదు. ప్రేమ కథలన్నీ ట్రాజిడీలు చేసి రాసిపారేశారు. కనీసం ఉల్లాసంగా చెప్పుకోటానికైనా ఒక్క కామెడీ ప్రేమకథ రాయలేదు."

అతడలా ఉడుక్కుంటుంటే, ఆమె నవ్వు ఆపుకుంటూ అన్నది. "పోనీ, మీరు రాయండి ఓ ఘాటైన ప్రేమ కథ."

"కరెక్ట్. గుడ్ ఐడియా. ఎవరూ రాయకుండానే తయారౌతుంది కథ. నువ్వు దమయంతివి. నేను రాజారావుని. ఈ దమయంతీ రాజారావుల కథ రాబోయే

తరాల్లో ప్రేమజంటలకు ఒక ఆదర్శమౌతుంది. మన కథలోకి ట్రాజిడీ రానేరాదు. ఫుల్ కామెడీ టోటల్ ప్లెజర్స్! ఓకే!"

అతడలా పూర్తి ఆత్మస్థైర్యంతో మాట్లాడుతుంటే ఆమె తృప్తిగా అతనికేసి చూస్తూ ఉండిపోయింది. ఆ విప్పారిన నేత్రాలనూ, ముగ్ధ మనోహరంగా ఉన్న ముఖాన్నీ చూస్తూ మెల్లగా దగ్గరకు రాసాగాడు రాజారావు. ఆమె "దూరం దూరం" అని లేచిపోయింది.

ఇలాంటివి ఎన్నో సంఘటనలు. అతడు దగ్గరకు రాబోవటం — ఆమె దూరం దూరం అని పారిపోవటం.

అలా ఎన్నాళ్ళు? ప్రేమకు పర్యవసానం ఏమిటి, ఉడుకు రక్తంలో ఉన్న యువతీ యువకుల చిత్త ప్రవృత్తి ఎట్టిది? వారి హృదయ స్పందన ఎట్టిది?

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం సైంటిఫిక్‌గా చెప్పవచ్చు.

ఒక అయస్కాంతం యొక్క ఉత్తర ధృవాన్నీ, వేరొక అయస్కాంతం యొక్క దక్షిణ ధృవాన్నీ వీలయినంత దూరంగా ఉంచాలి. ఆ రెండింటినీ దగ్గరకు తెచ్చే కొద్దీ వాటి మధ్య ఆకర్షణ పెరుగుతుంది. ఇంకా ఇంకా దగ్గరకు తీసుకొస్తూ ఉంటే, ఒక పరిధిలోకి వచ్చాక, ఇక వాటి నెవరూ దగ్గరకు తీసుకురానవసరం లేకుండానే, వాటంతటవే ఒక దానివైపుకు మరొకటి జరిగి, రాక్కున అతుక్కుపోతాయి.

వాళ్ళిద్దరి విషయంలోనూ అంతే జరిగింది.

* * *

నాలుగు నెలలు గడిచిపోయాయి. ఒక రోజు దమయంతి హడావుడిగా రాజారావు దగ్గరికొచ్చి, అతడి చెవిలో నోరుపెట్టి, "నేను వట్టిమనిషిని కాను" అని చెప్పింది. ఒక్కసారిగా రాజారావు కేమీ అర్థం కాలేదు. ఆమె అసలు విషయం వివరంగా చెప్పాక రాజారావుకు పరమ సంతోష మేసింది. ఇంక తమ వివాహానికి ఆలస్యం జరగటానికి ఎంత మాత్రమూ వీల్లేదంది దమయంతి. "సరే సరే"నన్నాడు రాజారావు. ఇంటి దగ్గర తల్లిదండ్రులతో చెప్పటానికి ఆ రోజే రైలెక్కాడు.

హఠాత్తుగా ఇంటికి వచ్చిన రాజారావును చూచి ఇంట్లోవాళ్ళందరూ ఆశ్చర్యపోయారు. "మేం నీకోసమే కబురు చేద్దామనుకుంటున్నాంరా" అన్నది రాజారావు తల్లి జానకమ్మ.

"ఎందుకూ?" అనుమానంగా అడిగాడు రాజారావు.

"ఎల్లుండి. మనం పెళ్ళి చూపులకు వెళ్ళాలి నాయనా."

"ఎవరికి పెళ్ళి? ఏమా కథ?"

"ఇంకెవరికిరా పిచ్చి సన్నాసీ. ఆ హోటళ్ళ తిండితిని ఎలా చిక్కిపోయావో చూడు. కరణంగారి అమ్మాయి రేణుక తెలీదుట్రా నీకు? అయినా నీకేంతెలుసులే — మొన్నటివరకూ పెదతల్లి దగ్గర పెరిగింది."

రాజారావు ఏమీ మాట్లాడలేదు. "వాళ్ళ ప్రయత్నాలలో వాళ్ళున్నారన్నమాట! తానిప్పుడు తొందరపడకూడదు. జాగ్రత్తగా అట్నుంచి నరుక్కురావాలి." అనుకున్నాడు. ఆ రోజూ, ఆ మరునాడూ గూడా, తన ప్రస్తావన ఇంట్లో ఎత్తలేదు. అనవసరంగా రభసకావటం అతడికిష్టం లేదు. మరునాడు ఆ పెళ్ళిచూపులకు వెళ్ళి

పిల్ల నచ్చలేదని చెప్తే సరిపోతుంది—అని నిర్ణయించుకున్నాడు.

ఏమీ ఎరుగనట్లుగా, అతి మామూలుగా తల్లిదండ్రులవెంట పెళ్ళిచూపులకు వెళ్లాడు రాజారావు. రేణుకను చూచాక, తాను చెప్పాలనుకునే 'సాకు' సబబుగానే ఉంటుందని తృప్తిగా నిట్టూర్చాడు. రేణుక చామన చాయలో అతి సామాన్యంగా ఉంది. ప్రపంచంలో ఆడపిల్లలను అందమైన వాళ్ళు, సాధారణరూపులు, అందవిహీనులు, అనే మూడు తరగతులుగా విభజిస్తే, రేణుకను నిరభ్యంతరంగా మూడో తరగతిలోకి చేరవచ్చు.

అప్పుడు రాజారావుకు దమయంతి గుర్తుకువచ్చింది. దమయంతి అప్సరస! మహారాణిగా పుట్టి ఉండవలసినది!

రాజారావూ, రేణుకా, ఇద్దరూ ఒకరినొకరు చూచుకుంటూండగా పెద్దవాళ్ళు వాళ్ళ వ్యవహారాలేవో మాట్లాడుకుని, కట్నం ముప్పైవేల దగ్గర తేల్చిపడేశారు. పైగా రేణుకను పెంచుకున్న పెదతల్లికి పిల్లలులేరు. ఆమె తాలూకు రెండెకరాల భూమీ, ఆపైన మిగిలిన వస్తువులూ.

రాజారావుకు కళ్ళు తిరిగాయి!

అప్పుడతని కన్నులముందు దమయంతీ, రేణుకా, ఇద్దరూ తిరిగారు.

దమయంతి విధవ. ఎవరితోనో సంవత్సరం కాపురం చేసింది. (ఈ రెండు అభ్యంతరాలూ అతడి కింతకు ముందు కనపడలేదు.)" రేణుక కన్నెపిల్ల. అనాఘ్రాత పుష్పం. పైగా ముప్పైవేలు! డబ్బుకన్నా విలువైనది వేరే ఏముంది ఈ రోజుల్లో."

"గుడ్‌గాడ్! ఒకటా రెండా, ముప్పైవేలు! థర్టీ థౌజండ్! ఫాంటాస్టిక్ ఆఫర్!!

"ఎందుకూ ఆలస్యం? తాంబూలం అందుకున్నానురా అబ్బాయ్" అన్నాడు రాజారావు తండ్రిగారు—తనయుడి అంగీకారంకోసం చూస్తూ.

రాజారావుకీ అంగీకారం తెలిపేందుకు అభ్యంతరం కనపడలేదు!

యువకులు సైతం డబ్బుకోసం గడ్డి తినటమూ, ఆడపిల్లలు మోసపోవటమూ జరుగుతూనే ఉన్నాయి సమాజంలో. బహుశా ఆ ప్రేమలు నిష్కల్మషమైనవి కాకపోవచ్చు. లోకంలో తీయగా మాటలు చెప్పేవాళ్ళూ, మంచిగా కనిపించేవాళ్ళూ అందరూ నిజంగా మంచివారేనని నమ్మటం బుద్ధి తక్కువతనం. వయస్సుకు సంబంధించిన ఆకర్షణకూ, మనస్సుకు సంబంధించిన కామవాంఛకూ ప్రేమ అని పేరు పెట్టుకున్నా, అది నిజంగా ప్రేమే అని నమ్మినా—అది పరిష్కారంలేని పొరబాటే అవుతుంది. ఎటొచ్చీ ఇలాంటి విషయాల్లో మోసం చేసినవాడికి మోసగాడు అనే మచ్చ మిగలదు. మోసం చేయబడినవాళ్ళకే మచ్చగూడా మిగుల్తుంది. ఇంతకంటే హృదయవిదారకం ప్రపంచంలో మరేమీ ఉండదు. ఇంతకంటే మహాదారుణంగూడా మరేమీ ఉండదు.

రాజారావులాంటి నీచులకు భగవంతుడే శిక్ష విధిస్తాడో తెలియదు.

★

[క్షమించండి! ఎంతో ఓర్పుతో యీ కథ చదివినందుకు కృతజ్ఞతలు. ఇది నా కథ. ఈ నా కథ ముందుతరాల వారికి గుణపాఠంగా చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోవాలి. నాలాంటి దౌర్భాగ్య పరిస్థితి భూమి మీద ఏ ఆడపిల్లకూ ఎప్పుడూ కలగకూడదు. భగవంతుడనేవాడు ఉంటే ఆ తండ్రిని నేను కోరుకునే చిట్టచివరి వరం ఆ వొక్కటే-ఆ వొక్కటే!

—"దమయంతి"]